పి.వి.బి. శ్రీరామమూర్తి

# అవార్డులిస్తాం! చందాకట్టండి!

ప్రియరంజనీరావుకు గొప్పటెన్షన్‌గా ఉంది. అప్పటికే పదిమంది పెళ్ళికొడుకుల ముందు కూర్చొని 'ఓకే' అనిపించుకోలేని పెళ్ళికూతురులా ఉంది. అతని మానసిక పరిస్థితి, గొప్ప అలజడిగా ఉంది. అందోళనగా ఉంది. అల్లకల్లోలంగా ఉంది. గాలికి చెదిరిన జుట్టులా. నక్సలైట్లు పేల్చేసిన ప్రభుత్వ కార్యాలయంలా, దీపావళి మరునాటి ఉదయపు వీధుల్లా.

ఇలాంటి పరిస్థితి అతనికి చాలాకాలంగా అలవాటయిపోయింది.

ఎక్కడ, ఏ కథల పోటీ కనిపించినా దానికి ఓ కథ పంపటం. దానికి గ్యారంటీగా ఫస్టు ప్రయిజు వస్తుందనుకోవటం, అది తన్నుమనటం. ఏ చివర్లోనో సాధారణ ప్రచురణల జాబితాలో చోటు చేసుకోవటం...... ఏగిరెగిరి సిటీ బస్సులో ఫుట్‌పాత్ మీద సీటు సంపాదించినట్టు! దానికే తృప్తిపడటం జరుగుతున్నదే! అదేం పాపమో ఇటీవలి కాలంలో సాధారణ ప్రచురణలో కూడా స్థానం లభించటం కరువైంది.

అయితే ఈసారి పోటీలో అతనికేదో ప్రైజు తగులుతుందనే అనుకున్నాడు. ఎండిపోతున్న చెరువులో ఓ చేపపిల్లయినా దొరకదా అని కొంగ ఆశ పడినట్లు.

కారణం లేకపోలేదు!

ఈసారి పోటీకి ఎటేస్ట్రెచ్ రాసేయక - మూడు, నాలుగుసార్లు కథను మార్చిరాసి, పెద్ద రచయితలకు చూపెట్టి మరీ ఫెయిర్ చేసాడు. అంతకంటే మరో ముఖ్య విషయం ఉంది. ఆ పత్రిక - 'నిర్వహిస్తోన్న కథల పోటీకి' న్యాయనిర్ణేతల పేర్లను కూడా ముందుగా ప్రకటించింది. అందువల్ల ముందుగా ముగ్గురు న్యాయనిర్ణేతలకీ ఉత్తరాలు వ్రాసాడు కాస్త లౌక్యంగా. మీ రచనలంటే నాకెంతో అభిమానమని, చెవి కోసుకుంటానని. దానికి వాళ్ళు 'థాంక్స్' చెప్పి లెటర్లు స్వదస్తూరితో రాసారు.

అందుకే ఈసారి తప్పనిసరిగా తన గాలానికి ఏదో చేప తగలొచ్చనుకున్నాడు. కానీ ఫలితాల గడుపు దగ్గర పడుతొన్నకొలది టెన్షన్ అధికమైపోయింది. అసంఖ్యాకంగా కథలు రావటం వల్ల ఫలితాల ప్రకటన ఆలస్యమైందని తెలియచేయటనికి చింతిస్తున్నామని మూడు వారాల ముందు, వచ్చే వారమే ఫలితాల ప్రకటన చేస్తున్నట్లు వారం ముందు ప్రకటించారు. రోజూ టెలిగ్రాం కోసం ఎదురు చూసాడు. ఓ రోజు టెలిగ్రా రానే వచ్చింది. కానయితే - అది అత్తగారికి సీరియస్‌గా వుందని! డీలా పడిపోయాడు. పేలని బాంబులా అయ్యాడు. అతనికెందుకో ఆశచావలేదు. ఈ సారి 'అసంఖ్యాకం రావటం వలన ఆలీసమయింద'ని అన్నాడు. కాబట్టి పత్రిక ద్వారానే ఫలితాలిస్తాడేమోనని!

పత్రిక కొన్నాడు. లేటు లేకుండా అనుకున్నటైంకే రావటం వల్ల! చేతులు వణుకుతున్నాయి. అయిసుముక్క పట్టుకున్నట్టు వేళ్ళు కొంకర్లు పోతున్నాయి. పేజీలు త్రిప్పాడు. ఎడిటర్ రిమార్కు, న్యాయనిర్ణేతల వివరణలూ ముందు పేజీల్లో చదివాడు. 'కథలు వాసిలోనూ, రాశిలోనూ బావున్నాయి. దళిత వాదం, స్త్రీవాదం మీద మంచి కథలు వచ్చాయి. వర్ధమాన రచయితలూ, లబ్ధ ప్రతిష్టులకు దీటుగా క్రొత్త రచయితలు పోటీ పడ్డారు. అందుకే ఈసారి పోటీలో అందరూ కొత్తవారే ఎన్నికకావటం విశేషం. అయిదారు వడపోతల తరువాత మా అభిమతాల మేరకు ఈ కథలు

నిర్ణయించాం. క్రింద వివరణ : వివరాలకు పేజీలు తిరగేయండి.

ఆనందం అర్ణవమయింది.
అంతరంగం సంబరపడింది.

ఇంతకీ తన వర్ధమాన రచయితా? లబ్ధ ప్రతిష్టుడా? క్రొత్తవాడా? అవునూ? తనుచాలా మంచి కథలే రాసాడు కనుక లబ్ధ ప్రతిష్ఠుడే! ప్రస్తుతం తనకింకా రావాల్సిన పేరు రాలేదు. కాబట్టి వర్ధమాన రచయితే! ఒక ప్రైజూ రాలేదు..... కాబట్టి కొత్త రచయితే!

"ఎడుకొండల వాడా, వెంకట్రవణా! నన్ను కొత్త రచయితగా దీవించు, ఓ ప్రైజు పారేసి, పర్త్రయిజు చెయ్యి!" మనసులో భజనలు!

పేజీలు తిరగేసాడు!

మొహం జేవురించుకుపోయింది. మాడిపోయింది.

వీళ్ళందరికీ ఇదే తొలిరచనట!

కొత్త రచయితలారా! ఆత్మ వంచన చేసుకోకండి. న్యాయ నిర్ణేతలారా, అబద్ధ మాడకండి, ఎడిటర్ గారూ! నిజం చెప్పండి, నిజంగా, నిజంగా..... నిఝంగా మీరు గుండె మీద రెండు చేతులూ గట్టిగా పెట్టుకోని చెప్పండి!

కొత్త రచయితలూ!

మీరు ఎడిటర్ గారికి ఏమీకారా? ఇందులో లాలూచీలేమీ లేవా?

'నో! ఇందతా మోసం, దగా!' అని గట్టిగా అరిచాడు.

"ఏదిసార్! పుస్తకాల షాపు వానితో పాటు చుట్టూరా ఉన్నవ్యక్తులూ కంగారుగా అడిగారు.

'అబ్బే....అబ్బే.... ఏం లేదు" అని తడబడుతూ అక్కణ్ణుంచికదిలాడు వాళ్ళు పిచ్చాణ్ణి చూసినట్లుగా అతన్ని చూడ్డం, ప్రియరంజనీరావుకు తల తీసేసినట్లయింది.

పత్రికను ముక్కముక్కలు చేసి కాలవలో పారేయాలనుకున్నాడు.

కానీ - 'విదేశీ వస్త్ర బహిష్కరణ'లా తన డబ్బును తను కాలువలో పారేయటం సముచితంగా కనిపించలేదు. ఇంటికెళ్తే కనీసం శ్రీమతయినా చదువుతుంది. కాగితాలు 'ఏ పొట్లాం కట్టడానికైనా పనికొస్తాయి. అను కున్నాడు.

ఇంటికెళ్ళాడు. కుర్చీలో కూలబడ్డాడు.

ఆకలిగా ఉంది. శ్రీమతి వక్కింటి కెళ్ళింది. పిల్లలు మీద కన్నుమన్నాడు. దూరంగా విసిరేసిన పత్రికను చేతుల్లోకి తీసుకున్నాడు. పేజీలు తిరగేసాడు.

అతని కళ్ళకి ఓ 'అద్భుతం' కనిపించింది.


అతని మనసుకో 'పులకింత' కలి గించింది.

ఆ ప్రకటన!

'మీరు రచయితలా? ఉపాధ్యాయులా? కళాకారులా? సంఘ సేవకులా? అయితే పదిరోజుల్లోగా మా సంస్థ ఇచ్చే ఉగాది పురస్కారాలకు దరఖాస్తు చేసకోండి! వివ రాలకు క్రింది చిరునామాకు స్వంత చిరు నామా గల రూపాయి స్టాంపు అంటించి కవరు జతపరచి పంపండి!' అని.

ఎగిరి గంతేసాడు.
దేవుడు దయతలచాడు.

వెంకన్న వరమిచ్చాడు. అతని జేబులో రెడీగా స్టాంపులుంచుకోవటం చేత అప్పటికప్పుడు వివరాలకి స్వంత చిరునామాగల అంటించిన స్టాంపుల కవరుతో పంపాడు.



వారం రోజుల్లో పది పేజీల కరపత్రం వచ్చింది!

'మీలో ప్రజ్ఞ ఉంది. అయినా ఈ బూర్జువా పత్రికలు మిమ్మల్ని గుర్తించటం లేదు. అవునా? మీరు ఆవేదన పడవద్దు, మీ లాంటి మేధావులను, ప్రజ్ఞావంతులను ఎంచి, సేకరించి గౌరవించటానికే ఈ 'ప్రజారంజనీ' సంస్థను ఏర్పరిచాం! మీరు రచయితలే అయితే - ఇంత వరకూ మీరు వ్రాసిన కథలు, ఏఏ పత్రికల్లో వచ్చాయి? తేదీల వివరాలతో, జిరాక్సు కాపీలు అవసరం లేదు. మీ హామీ పత్రం చాలు, పంపండి. రెండు ఫోటోలు పంపండి. మీ బయోడేటా వివరంగా పంపండి! అన్నట్టు రెండు వందలే - క్రాస్డ్ డి.డి. పంపండి. ఈ కరపత్రం అందిన వారం రోజుల్లో పంపండి. మాకు అసంఖ్యాకంగా వచ్చిన ఎంట్రీ పరిశీలనకు గడువు సరిపోవటం లేదు' అని కరపత్రం చదివిందే చదివాడు.

'రెండు వందలు పంపాలా?' మనసు విరిగింది.

తీరా పంపితే మాత్రం అవార్డు వస్తుందని గ్యారంటీ ఏంటి? చిన్నప్పుడు పేపర్లో ఫజిల్ నింపి పంపితే ఏమయింది? రెండొందలకు వి.పీ. వచ్చింది. విడిపిస్తే రెణ్ణెల్లు పలికే రేడియో వచ్చింది. ఇరవై సంవత్సరాలు నాన్న తిడుతూనే ఉన్నాడు. ఇది అలా కాదు కదా?

కాదు?

దీనిలో ఎందుకో అలాంటి మోసం కనిపించలేదు.

ఆలోచిస్తే మనసు మారిపోతుంది.

ఎందుకైనా మంచిదని తన పత్రికలకు రాసిన ఉత్తరాలు, జోకులూ, మినీ కవితలు దగ్గర్నుంచీ జిరాక్సు కాపీలు - నూట ఏభై ఖర్చయినా - వెనుకాడక - తీసి పంపాడు రెండొందలు డి.డి.పంపాడు. రిజష్టర్డు పోష్టులో పంపాడు.

పదిరోజుల్లో ప్రియరంజనీరావుకు కొరియర్లో ప్రజారంజనీ సంస్థ నుండి ఉత్తరం వచ్చింది. పిక్కబలంతో తన్నిన ఫుట్ బాలులా ఎగిరి గంతేసాడు. ఉత్తరం చదివాడు. గట్టిగా అరిచాడు. పిడుగు పడినట్లు, వంట చేస్తోన్న వాళ్ళావిడ సిలిండరు పేలిపోయిందో, కుక్కరు ఎగిరిపడిందో అని భయపడి వంటిం ట్లోంచి ఒకే పరుగున వచ్చి బయటపడింది.

""ఏమే నాకు అరవార్డు వచ్చిందే?"

"ఏ వార్డులో వేసారండీ?" ఆమెది వానా కాలంచదువు. అందుకే అలాగంది.

"నీ మొహం సంతకెళ్ళా? నీ లాంటి 'దెయ్యం'ని కట్టుకోబట్టే - నేను ఎదగ లేకపోయాను"

"మీరెదగడమేంటండీ! మీరేమన్నా ఆడపిల్లా? గేదె పెయ్యా! అంది అమా యంకంగా."

"అది కాదే! నాకు బహుమతి వచ్చింది" అన్నాడు. ఆమెను గట్టిగా వాటేస్తు. భర్త ఆనందానికి ఆమె కూడా ముగ్ధురాలయి "ఎంతండీ" అంది.

గతుక్కుమన్నాడు.

"నిజమే? ఎంతిస్తారు చెప్మా?" అని కాగితం పూర్తిగా చదివాడు. దాన్లో ఎక్కడా వివరం లేదు. దాన్లో రాసిందల్లా ఒక్కటే ఉగాదికి రెండు రోజులు బొంబాయి రావాలట ప్రసిద్ధ హిందీ సినీనటి 'కిస్మిస్' చేతుల ద్వారా బహుమతి ఇస్తున్నారని! చెప్పారు. భార్య సంతోషించింద.

వెంటనే బేంకుకెళ్ళాడు. డబ్బు విత్‌డ్రా చేసాడు. స్టేషన్‌కెళ్ళాడు. టిక్కెట్ రిజర్వు చేసాడు. తోవలో తనకు 'ప్రజారంజని సంస్థ' పురస్కారాన్నిస్తోన్న విషయం పత్రికా విలేకర్లకు తెలియచేసాడు. పాస్‌పోర్టు ఫోటో ఇచ్చాడు. మర్నాడే అన్ని పత్రికల్లో న్యూస్ వచ్చేసింది. మిత్రులంతా కంగ్రాట్స్ తెలిపారు. 'ఎంతిస్తారు' అని అడిగారు. 'ఏమో పదివేలయినా ఇవ్వచ్చు. అంత పెద్ద సంస్థ మరి!' అన్నాడు.

ఉగాదికి ముందే బొంబాయి చేరు కున్నాడు.

ఎడ్రస్ కనుక్కొని వెళ్ళాడు.

అది జనమా? కాదు ప్రవాహం! ఇనుకను లారీతో తిరగేసినట్లు, కొబ్బరి కాయలు పోగులు పోసినట్లు రకరకాల ద్వారాలు. ముందు ద్వారంలో దూరగానే 'సార్, మీ కార్డు చూపెట్టండి. సార్!' అని ఒక అమ్మాయి ఇంగ్లీషులో వీణ మీటింది. కార్డు చూపెట్టాడు.

"కంగ్రాట్స్ సార్! అసంఖ్యాక రచయి తల్లో మీకు ఈ అవార్డు వచ్చిందంటే మీరెంత గొప్పవారో అర్థం అవుతోంది. బైదిబై - మీరో ఫీస్టీ పేచెయ్యాలి సార్! అందామె.

"ఎందుకు?" అన్నాడు.

"సార్ మీకు గార్లెండ్ వెయ్యాలి కద్సార్. బొకే అయితే ఇరవయ్యే!" అంది.

మాట్లాడకుండా యాభై ఇచ్చేసాడు. మరో ద్వారం తిరిగాడు మళ్ళీ ఓ అమ్మాయి సితార గొంతు పలికించింది. 'ఓ అయిదొందలు ఇవ్వాలి సార్!" అన్నది.

"ఎందుకు" సందేహంగా అడిగాడు.

"ఇంత దూరం వచ్చి శాలువా లేకుండా వెళ్తారా?" అంది.

కోపంగా చూసాడు. 'అఖర్లే' అనాలనుకుని అన్లేక పర్సు తీసి అయిదొం దలిచ్చాడు. మరో ద్వారం దగ్గరకు చేరాడు. మరో అమ్మాయి వంశీ వాయించింది. కంగ్రాట్స్ చెప్పింది. ముద్దు పెట్టుకుంది. "వెయ్యే పేచెయ్యమంది"

"దేనికి;"

"వీడియో కవరేజ్ చేస్తాం. అన్ని పేపర్లలో టీవీ వార్తల్లో వచ్చే ఏర్పాటు చేస్తాం" అంది.

ప్రియరంజనిరావుకి ఏడుపొచ్చింది.

అక్కడికక్కడ గుండె ఆగిపోతే బావుణ్ణనిపించింది.

కానీ విచిత్రం!

అప్రయత్నంగా చేతులు పర్సును

తీసాయి. డబ్బులిచ్చేసాయి. పర్సు పల్చబడి పోతోంది. గుండె వేగం హెచ్చింది. మరి ద్వారం తగల్లేదు. హాలు నిండా కుర్చీలు. కుర్చీల్లో జనం!

ఉదయం పదిగంటలకు ప్రారంభం అయింది అవార్డుల ప్రదానం. అలా పిలుస్తునే ఉన్నారు. వస్తునే ఉన్నారు. అందుకుంటునే ఉన్నారు. మధ్యాహ్నం నాలుగ్గంటలకి తన పేరు పిలిచారు. సంతోషంతో వేదికెక్కాడు. ఒకమ్మాయి దండ వేసింది. ఒకమ్మాయి శాలువ కప్పింది. కెమేరాలు క్లిక్కుమన్నాయి. కిస్మిన్ వచ్చింది. ఓ చెక్క మెమెంటో సుతారంగా అందిచ్చింది. అంతే! ఎంతో కష్టపడి తిరుపతి వెళ్తే దేవుణ్ణి చూసామా, లేదా అన్న భ్రమలో ఉండగానే బయటకు నెట్టబడినట్టు స్టేజి మీంచి నెట్టేసారు.

"సార్! పది రూపాయిలౌస్తాయి" అన్నాడో వ్యక్తి.

"ఎందుకు?"

"ఇందాక టీ, బిస్కట్లు తీసుకున్నారు కదా!"

"నేను తీసుకోలేదే. నువ్వే ఇచ్చేవ్"

"అవున్సార్. రెస్పెక్ట్‌గా ఇస్తాం, మీరిచ్చేయండి సార్" అన్నాడు అతనితో వాదులాడ్డం ఇష్టం లేక పదీ ఇచ్చేసాడు.

అతనికి గొప్ప చిరాగ్గా ఉంది.

అసహనంగా ఉంది. ఆక్రోశంగా ఉంది.

అవార్డుల ప్రదానోత్సవ సభముగిసింది.

కమిటీఛైర్మన్ మైకు దగ్గరకొచ్చి "అవార్డు గ్రహీతలు దయచేసి ఉండండి. మీతో అయిదు నిమిషాలు పనుంది." అన్నాడు. 'డబ్బు ఇస్తారేమో! ప్రియరంజనిరావులో మళ్ళీ ఆశ! బట్టతల మీద వెంట్రుకులు మొలవ్వా అని ఆశ పడ్డట్టు. అందరూ వెళ్ళాక ఛైర్మన్ వేదికెక్కాడు.

అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపాడు. ఆ తరువాత తన సంస్థ చేసిన సేవలు వివరించాడు. "అవార్డు విజేతలారా! మీకో విన్నపం. ఈ సంస్థ గురించి మీ ప్రాంతంలో తెలియచెయ్యండి. జనాన్ని ప్రోత్సహించండి. పదిమందిని తీసుకురాగలిగితే మీకు చందాలేకుండా, సన్మానం చేస్తాం! నూరు మందిని తేగలిగితే ఇక్కడ ఏ కలక్షన్లూ వనూలు చెయ్యం. వెయ్యి మందిని తీసుకురాగలిగితే రానుపోను ఛార్జీలు మేమే భరిస్తాం" అని అతను చెప్తున్నాడు. ప్రియరంజనీరావు బుర్ర గిర్రున ఫేన్‌లా తిరుగుతోంది. బీపీ రైజయిపోయింది. అక్కడ ఉండలేక లేచిపోయాడు. ఉంటే మళ్ళీ టీ ఇస్తారో, టీఫినిస్తారో, భోజనమే పెడతారో నన్న భయంతో!

అయితే

కుళ్ళిపోయిన బత్తాయివండులా అయిన అతని మనసులో ఓ తళతళమన్న మెరుపు ఆలోచన! "ప్రియరంజనీ అవార్డు పేరున తనూ ఓ సాహిత్య సేవా సంస్థను హైదరాబాద్‌లోనే ఎందుకు నెలకొల్పరాదు?" అని!

కథా నిలయం
శ్రీకాకుళం